సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



ఉరుసును జయప్రదం చేయండి

కమలాపురం దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా ఉరుసు మహోత్సవాలను జయప్రదం చేయాలని దర్గా కన్వీనర్ ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. -8లో



పెరిగిన ధరలతో సామాన్యుల బతుకు దుర్భరం

ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల బతుకు దుర్భరం చేసిందని పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. -8లో



వాతావరణం

జిల్లాలో గురువారం 26.2 – 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు కడపలో ముస్లింల నిరసన

కడప కల్చరల్: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కడప నగరానికి చెందిన ముస్లింలతో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు తెలిపారు. జుమ్మా నమాజ్ తర్వాత స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి ముస్లిం తన బాధ్యతగా ఈ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మే 10 తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 08562 258622, 244622 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

13న అండర్ 23 క్రికెట్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్: కడపలో ఈ నెల 13వ తేదీ సీనియర్స్, అండర్ 23 క్రికెట్ పురుషుల ఎంపికలు జరగనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సెలక్షన్స్ కోసం రావాలని కోరారు. ఎంపికల కోసం వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు , బర్త్ సర్టిఫికెట్ (ఫారం 5), పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో పాటు తమ క్రికెట్ కిట్ బ్యాగులు తీసుకురావాలని సూచించారు. ఉదయం 7:30 గంటలకు కడపలోని వైఎస్సార్ ఏసీఏ స్టేడియానికి హాజరు కావాలని వివరించారు.

'కేజీబీవీ 'దరఖాస్తుకు నేడు ఆఖరు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు 11వ తేదీ శుక్రవారంతో గడువు ముగుస్తుందని సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 17 కేజీబీవీలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌తోపాటు 7,8,9,10,12 తగతులలో మిగిలి ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తులను htpps://apkgbva.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో శుక్రవారం సాయంత్రం సీతారామ కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీడీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని పరిపాలన భవనం సమావేశం హాల్‌లో చైర్మన్, ఈఓ జె. శ్యామలరావు, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈఓ వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జేసీ అదితిసింగ్, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, సీవీఎస్ఓ హర్షవర్ధన్ రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీతారాము ల కల్యాణం సందర్భంగా ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. తలంబ్రాల పంపిణీకోసం తొలిసారిగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి కల్యాణం నేరుగా ఎల్ఈడీ స్క్రీన్ మీద ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశామని తెలియజేశారు.

రారండోయ్.. వేడుక చూద్దాం

- నేడు పండు వెన్నెల్లో కోదండరాముని పరిణయం
- సిద్ధమైన ఒంటిమిట్ట


విద్యుద్దీపాలంకరణలో శ్రీ కోదండ రామాలయం

కడప కల్చరల్/రాజంపేట: దేశంలో ఎక్కడా లేని అరుదైన సంప్రదాయం ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఉంది. మిగతా అన్నిచోట్ల సీతారామ కల్యాణాన్ని పగటిపూట నిర్వహిస్తారు. కానీ ఒంటిమిట్టలో మాత్రమే రాత్రి పూట జరుపుతారు. ఇలా వెన్నెల్లో సాక్షాత్తు చందమామ సాక్షిగా సీతారామ కల్యాణం నిర్వహించడం ఈ ప్రాంతానికి ఉన్న విలక్షణమైన సంప్రదాయం. ఈ నెల11న జరిగే కల్యాణోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించనున్నారు. 2014లో ఈ ఆలయాన్ని టీటీడీ తన పరిధిలోకి తీసుకునేంత వరకు ఆలయ రాజ (తూర్పు) గోపురం మెట్లపైనే కల్యాణం నిర్వహించేవారు. 2015 నుంచి గ్రామం వెలువల నిర్వహించడం ప్రారంభమైంది.

బుక్కరాయల పాలనలో..

వాల్మీకి రామాయణం ప్రకారం త్రేతాయుగంలో చైత్ర మాసం పూర్ణిమకు ముందు ఫల్గుణీ నక్షత్రంలో కల్యాణోత్సవం నిర్వహించారు. బుక్కరాజు 1356లో ఈ ఆలయాన్ని పునరుద్ధరించాక తొలిసారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం మొదలైంది. ఆ సంవత్సరంలో ఫల్గుణీ నక్షత్రం రాత్రిపూటే రావడంతో నాడు బుక్కరాయలు స్వామి కల్యాణాన్ని రాత్రిపూటే నిర్వహించారని చరిత్రకారుల సమాచారం. ఆ తర్వాత ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో అదే సంప్రదాయం కొనసాగుతోంది. ఇతర ప్రముఖ రామాలయాల్లో రాముడు పుట్టినరోజున వివాహం నిర్వహిస్తుండగా, ఒంటిమిట్టలో మాత్రం త్రేతాయుగంలో రామయ్య కల్యాణం జరిగిన నక్షత్రంలోనే కల్యాణం నిర్వహిస్తున్నారు.

ఆలయ ప్రాంగణం నుంచి.. ఆరుబయలు వరకు

ఒంటిమిట్ట ఆలయం టీటీడీ పరిధిలోకి వెళ్లాక స్వామి కల్యాణాన్ని ఆలయానికి కొద్ది దూరంలో నిర్వహించడం ప్రారంభించారు. హాజరయ్యే భక్తుల సంఖ్యకు తగినట్లుగా గ్రామం వెలుపల కల్యాణం చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. వెన్నెల్లో రామచంద్రుని సాక్షిగా జరగాల్సిన కల్యాణాన్ని కల్యాణ వేదిక చుట్టూ పందిళ్లు వేయడంతో చంద్రుని చూసే అవకాశం లేదని భక్తులు అప్పటి నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ విషయంగా అసంతృప్తిని తెలుపుతూ జిల్లాకు చెందిన చరిత్రకారులు, భక్త ప్రముఖులు టీటీడీ, రాష్ట్ర అధికారులకు వినిపత్రాన్ని అందజేస్తూ వచ్చారు. మొత్తానికి ప్రస్తుతం ఈ దిశగా అధికారులు స్పందించారు. స్థానిక భక్తుల సెంటిమెంటును గౌరవిస్తూ ఆరుబయట కల్యాణం నిర్వహిస్తూ వస్తున్నారు.

చంద్రుని కోరికపై..



ఒంటిమిట్ట రామయ్య కల్యాణోత్సవానికి సంబంధించి మరో పురాణ గాథ జనంలో ఉంది. దాని ప్రకారం శ్రీరాముని జననం పగలు జరిగింది. ఆయన భువిపై ఉదయించే అద్భుతమైన సన్నివేశాన్ని తిలకించలేకపోయానని చంద్రుడు బాధపడ్డాడు. శ్రీకృష్ణావతారంలో తాను ఉదయించే దృశ్యాన్ని తిలకించే అవకాశాన్ని ప్రసాదిస్తానని రాముడు చంద్రునికి వరమిచ్చాడు. అప్పటి నుంచి రాముడు రామచంద్రుడయ్యాడు. రాముని కల్యాణం పగలు జరగడంతో ఆ దృశ్యాన్ని చూసే అదృష్టం లభించలేదని విచారిస్తున్న చంద్రునికి ఒంటమిట్టలో రాత్రి పూట కల్యాణం జరుగుతుందని, దాన్ని తిలకించవచ్చని రాముడు మాట ఇచ్చాడు. అప్పటి నుంచి ఒంటిమిట్టలో చంద్రుని సాక్షిగా వెన్నెల్లో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్నారు.

గోటితో ఒలిచిన తలంబ్రాలు అందజేత



ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో శుక్రవారం జరగనున్న సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన తలంబ్రాలను సమర్పించారు. సూపరిటెండెంట్ హనుమంతయ్య అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో వీటిని అందించారు. తలంబ్రాల కోసం మూడునెలలపాటు వరిని ప్రత్యేకంగా పండించి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన భక్తులు భక్తిభావంతో మూడు నెలలపాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం రాక

కడప సెవెన్‌రోడ్స్: ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరగనున్న కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. సాయంత్రం 3.35 గంటలకు విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి 4.20కి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 4.30కి అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 5 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 6.30కి అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 6.35కు కల్యాణ వేదిక ఆవరణానికి చేరుకుంటారు. 6.45 నుంచి 8.30 వరకు కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవార్లకు పట్టువ స్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. సీతారామ కల్యాణోత్సవాన్ని తిలకించిన తర్వాత 8.35కి రోడ్డు మార్గాన బయలుదేరి 8.40 గంటలకు టీటీడీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆ రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటిరోజు ఉదయం 8.50 గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి 9.20 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9.30 గంటలకు అక్కడి నుంచి విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

కొనసాగుతున్న సంప్రదాయం



బుక్కరాయలకాలం నుంచి రాత్రి పూటే తొలి సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. నాటి నుంచి నేటి దాకా అదే సంప్రదాయం కొనసాగుతోంది. కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామ కల్యాణాన్ని పరమానందతో తిలకిస్తాడు..ఒంటిమిట్టలో శ్రీరామకళ్యాణం తిలకించే ఏర్పాటుచేసింది బ్రహ్మదేవుడుకాదు.. శ్రీ మహావిష్ణువు అని కూడా పురాణాలు చెబుతున్నాయి. –వీణారాఘవచార్యులు, ప్రధానఅర్చకులు, రామాలయం, ఒంటిమిట్ట

బ్రహ్మోత్సవం.. నయనమనోహరం






మోహినీ అలంకారంలో భక్తులకు అభయమిస్తున్న ఒంటిమిట్ట కోదండ రాముడు, గరుడ వాహన సేవలో భక్తజన సందడి

- మోహినీ అలంకారంలో జగన్మోహనాకారుడు
- వైభవంగా గరుడవాహసేవ

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మోహినీ అలంకారంలో స్వామివారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చాడు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరిగింది. అనంతరం రాత్రి 7 గంటల నుంచి గరుడ సేవ ఘనంగా జరిగింది. రామయ్య పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాకరుల కోలాటాలు, చెక్కభజనల మధ్య కోదండ రాముడి ఊరేగింపు కనులపండువగా సాగింది. ఈ కార్యక్రమం టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. గురువారం సీతారాముల కళ్యాణం జరుగుతున్న నేపథ్యంలో దాశరథి దివ్యక్షేత్రాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో ఆరోరోజు శుక్రవారం ఉదయం 7:30 నుంచి 9:30 గంటల వరకు శివధనుర్భంగాలంకారం, 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం. సాయంత్రం 3:15 నుంచి 5 గంటల వరకు ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 6:30 నుంచి 8:30 వరకు కల్యాణోత్సవం, 9:30 నుంచి 10:30 వరకు గజవాహనం, 11 నుంచి 11:15 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు.

మైలవరం జలాశయానికి నీరు విడుదల


మైలవరానికి పరుగులు పెడుతున్న కృష్ణా జలాలు

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేసినట్లు జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమమహేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో సాగు, తాగునీటి అవసరాలకోసం గండికోట జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి నీటిని విడుదల చేశామన్నారు. గండికోట జలాశయంలో పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 22.5 టీఎంసీలు నిల్వ ఉన్నాయన్నారు. గండికోట ప్రాజెక్టు నుంచి గండికోట ఎత్తిపోతలపథకం ద్వారా మూడు మోటర్లతో 300 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నామని వివరించారు.

గంజాయి మత్తులో మైనర్లు!

- ఇంట్లోని బంగారు ఆభరణాలను సైతం దోచిపెడుతున్న వైనం..
- కడపలో రెండవ ప్రధాన స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనే సాక్ష్యం



సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఇప్పటికే సోషల్ మీడియా ఊబిలో పడి చిత్తవుతున్న యువత.. గంజాయి మత్తుకూ బానిసవుతున్నారు. కాలేజీ కుర్రాళ్లే కాదు.. స్కూల్ పిల్లలు సైతం ఈ మత్తులో మునిగితేలుతున్నారు. ముఖ్యంగా కొందరు యువత, మైనర్లతో 'ఇన్‌స్టాగామ్'లో గ్రూపులు కట్టి, చాటింగ్‌లు చేస్తున్నారు. ఇదేదో మంచి అలవాట్లకు, యువతకు ఉపయోగపడే విధంగా ఉంటే పర్వాలేదు. గంజాయి మత్తుకు అలవాటుపడేలా మైనర్ బాలురను ఆకర్షిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ గ్రూప్‌లో 14 ఏళ్ల బాలుడు గంజాయి మత్తుకు అలవాటు పడ్డాడు. అంతేనా.. తన పుట్టినరోజు వేడుకను ధూంధాంగా జరుపుకుని లక్షలాది రూపాయలను ఖర్చుచేసి జల్సాలకు పాల్పడ్డాడు. ఇన్‌స్టాగామ్‌లో ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకున్న పొడవాటి, వివిధ డిజైన్లతో ఉన్న కత్తిని పట్టుకుని ఏకంగా ఫొటోకు ఫోజులిచ్చి మైనర్లను ఆకర్షించసాగాడు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ పోలీస్ సబ్ డివిజనల్ అధికారితో సైతం సెల్ఫీ ఫొటో దిగాడు. స్నేహం కొద్దీ, స్ఫూర్తి కోసమో ఆ పోలీసు అధికారి సెల్ఫీ తీసుకోవడానికి అనుమతిస్తే, ఆ బాలుడు ఆ సెల్ఫీ ఫోటోను తన ఇన్‌స్టా గ్రామ్ ద్వారా చాటింగ్‌కు ఉపయోగిస్తూ, మిగతా 'మైనర్ల' దృష్టిలో 'బాస్'గా మారిపోయాడు. ఈ క్రమంలో తనచేత ఆకర్షించబడిన బాలురను కత్తితో, తన చేష్టలతో బెదిరించి ఓ మైనర్ బాలుడి ఇంటి నుంచి పలు దఫాలుగా దాదాపు 8 తులాల బంగారు ఆభరాలను తెప్పించుకుని ఎంచక్కా తాను, తన గ్రూప్ సభ్యులతో జల్సాలకు పాల్పడ్డాడు. ఈవ్యవహారమంతా గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలలో చోటుచేసుకుంది. ఆ సమయంలో బాధిత బాలుడి తండ్రి కువైట్‌లో ఉన్నాడు. ఇటీవల కడపకు వచ్చి బంగారు ఆభరణాల గురించి ఆరా తీశారు. ఇన్‌స్టాగామ్ వేదికగా ఓ మైనర్ బాస్‌కు తమ కుమారుడు దాదాపు 8 తులాల బంగారు ఆభరణాలను తీసుకెళ్లి ఇచ్చినట్లు తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు. దీనిపై 'డబుల్‌స్టార్' తనపాటికి తాను విచారణ చేసేందుకు ప్రయత్నిస్తుండగా టీడీపీ ఎమ్మెల్యే అనుచరులమంటూ ఇద్దరు వ్యక్తులు అడ్డుకుంటున్నట్లు సమాచారం.

- మత్తు పదార్థాల నివారణ కోసం పోలీసులు నిఘా కార్యక్రమాలను చేపట్టినా చాపకింద నీరులా గంజాయి మత్తు విస్తరిస్తూనే ఉండడం విచారకరం. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

హామీలే.. ఏమీలే..

- అధికారంలోకి వచ్చి పదినెలలనైనా హామీల అమలులో కనిపించని పురోగతి
- జిల్లాలో పడకేసిన అభివృద్ధి
- నేడు ఒంటిమిట్టకు సీఎం చంద్రబాబు రాక


వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్)



సాక్షి రాయచోటి: 2014 నుంచి 2019 వరకు చంద్రబాబే సీఎం. అప్పట్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరులకు ఎన్నో హామీలు ఇచ్చి ఆశలు రేకెత్తించినా అతీగతీ లేదు. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు పునర్విభజనతో ఏర్పడిన అన్నమయ్య జిల్లాకు ప్రతిపక్ష నేత హోదాలో అనేక హామీలు ఇచ్చారు. అందరికీ అన్నీ చేస్తాం...అధికారంలోకి రాగానే ఇచ్చిన హామిలు నేటికీ నెరవేరలేదు. నేడు ఒంటిమిట్టకు సీఎం చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో మీరు చెప్పిన మాటలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. అధికారంలోకి వస్తే ఒకటేమిటి..అనేక రకాలుగా జిల్లాను తీర్చిదిద్దుతామని చెప్పినప్పటికీ ఇప్పటికీ అడుగులు పడలేదు. అధికార పగ్గాలు చేపట్టి పది నెలలు దాటుతున్నా అభివృద్ధి ముందుకు కదల్లేదు. రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పర్యటించిన చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో అధికారంలోకి రాగానే రూపురేఖలు మారుస్తామని చెప్పినా ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని మేధావులు అభివర్ణిస్తున్నారు.

ఉద్యాన హబ్ కోసం ..

అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లెప్రాంతాల్లో మామిడితోపాటు అరటిని అధికంగా సాగు చేస్తారు. ఎన్నికలకు ముందు అప్పటి మాజీ సీఎం చంద్రబాబు రైల్వేకోడూరులో ఉద్యాన హబ్ ఏర్పాటు చేసి పండ్ల తోటల రైతుల సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఇది కూడా అమలుకు నోచుకోలేదు.

జిల్లా కేంద్రంలో పడకేసిన అభివృద్ధి

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో అభివృద్ధి పడకేసింది. దాదాపు 80–90 శాతం పనులు పూర్తయినా ఆయా పనులను ఇప్పటికీ పూర్తి చేయలేదు. అలాంటి వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. కానీ వైఎస్సార్‌సీపీ సర్కార్‌కు పేరొస్తుందన్న ఆలోచనతో వాటిని నిర్లక్ష్యం చేయడంపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

కృష్ణా జలాలు ఎప్పుడు బాబూ!

హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా చక్రాయపేట మండలం కాలేటి వాగు నుంచి తంబళపల్లె వరకు తీసుకుపోయే కాలువలకు సంబంధించి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్ద ఎత్తున బిల్లులు కూడా ఆగిపోయాయి. చివరి దశలో ఉన్న శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి పూర్తి చేయాల్సి ఉంది. వీటికే నిధుల కేటాయింపుకు అవరోధాలు ఉండగా, బనకచర్ల నుంచి ప్రత్యేక కాలువల ద్వారా నీరు దేవుడెరుగు అంటూ పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. సంబేపల్లె మండల పరిధిలోని ఝరికోన ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం లేకపోవడంతో చుక్కనీటిని కూడా అందుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన హామీలకు రూపుకల్పించాలని ప్రజలు సీఎంను కోరుతున్నారు.

కలగా మారుతున్న అన్నమయ్య ప్రాజెక్టు

జిల్లాలో భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటి ప్రవాహానికి పింఛాతోపాటు అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. అయితే అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి టెండర్ల వరకు తీసుకొచ్చినా తర్వాత మళ్లీ అంచనాల రూపకల్పనతో ఆగింది. ఈలోపు అధికార పగ్గాలు చేపట్టిన కూటమి సర్కార్ అన్నమయ్య ప్రాజెక్టు గురించే పట్టించుకోవడం లేదు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి నష్టపోయిన గ్రామాల ప్రజలతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మమేకమైన సందర్భంలోనూ ప్రాజెక్టు గురించి చర్చించారు. ఎన్నికల ముందు రాజంపేట సభలో కూడా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మిస్తాన్న హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ ప్రతిపాదనల దశ దాటలేదు. అలాగే రాజంపేటకు సంబంధించి మెడికల్ కళాశాల తీసుకు వస్తామని అప్పట్లో బాబు నోట వినిపించినా... అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా నోటా మాట అమలులో కనిపించలేదు.

టీడీపీ నేతల అండతోనే శ్రీ మాధవ ఆంజనేయస్వామి భూముల ఆక్రమణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజారామిరెడ్డి

కడప రూరల్ : మైదుకూరులోని శ్రీ మాధవ ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన విలువైన భూముల ఆక్రమణకు స్థానిక తెలుగు దేశం పార్టీ నేతల అండదండలు ఉన్నాయని చాపాడు మండలం పెద్ద చీపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎస్ఆర్ రాజారామిరెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైదుకూరులో శ్రీ మాధవ ఆంజనేయ స్వామి దేవస్థానానికి విలువైన భూములు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ స్థలాల్లో అక్రమంగా ఇద్దరు భవనాలు నిర్మించారని, మరో 17 మంది వరకు దాబాలు, షెడ్‌లు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. ఈ ఆక్రమణదారులకు స్థానిక టీడీపీ బడా నేతల అండదండలు ఉన్నాయని తెలిపారు. ఆక్రమణలపై పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇటీవల తిరుపతి దేవదాయ శాఖకు చెందిన అధికారుల వచ్చి సర్వే చేసి, ఆక్రమణలను నిర్ధారించారని పేర్కొన్నారు. మార్చి 3వ తేదీన ఆక్రమిత కట్టడాలని తొలగించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారన్నారు. టీడీపీ నేతల కారణంగా ఆ ఆదేశాలు బుట్టదాఖలు అయ్యాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్రీ మాధవ ఆంజనేయ స్వామి ఆస్తులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పెరిగిన ధరలతో
సామాన్యుల బతుకు దుర్భరం

- ఇప్పటికే పెరిగిన కరెంటు, రిజిస్ట్రేషన్ చార్జీలు
- పెట్రో ధరల పెరుగుదల నిత్యావసర ధరలపై ప్రభావం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల బతుకు దుర్భరం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. కడపలోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంగానీ, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంగానీ పేదలకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే కరెంటు చార్జీలు విపరీతంగా పెంచారని, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెంచారన్నారు. ఇప్పుడు గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు, పెట్రోల్, డీజిల్ ధరలను కూడా పెంచడం దారుణమన్నారు. ఉజ్వల పథకంలో ఉన్న పేదలకు కూడా పెంచిన ధర వర్తింపజేయడం వల్ల పేదలు మళ్లీ కట్టెల పొయ్యికి పరిమితమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రభావం నిత్యావసర ధరలపై పడనుందన్నారు. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, సామాన్యులు ఏం కొనలేని, తినలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఇలాగే గ్యాస్ ధర పెంచితే దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఆ భారాన్ని ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాయడం మినహా చేసిందేమీ లేదన్నారు. సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు...సంపద సృష్టించకపోగా ఇప్పటికే రూ.1.64లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. వారం వారం అప్పులు చేస్తున్నా ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇవ్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. జన్మభూమి పథకానికి పేరు మార్చి పీ–4 అనే కొత్త స్కీం తెచ్చారన్నారు. దాతల సహకారంతో గ్రామాల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలన్నది దీని ఉద్దేశమన్నారు. టీడీపీ నాయకులకు మేలు చేయాలన్న ఆలోచనతో తీసుకొచ్చిన ఈ స్కీంకు దాతల సహకారం ఉండదన్నారు. సూపర్ సిక్స్ పథకాలని చెప్పి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. వీరు ప్రజలకు చెప్పేదొకటి, చేసేది మరొకటని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చాలని, అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, బీహెచ్ ఇలియాస్, జి. శ్రీనివాసులరెడ్డి, త్యాగరాజు, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

- ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం నేపథ్యంలో నిర్ణయం
- వాహనదారులు పోలీసు శాఖకు సహకరించాలి
- జిల్లా ఎస్పీ ఈ.జీ. అశోక్ కుమార్


ఈ.జీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : ఈ నెల 11న శుక్రవారం ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కడప నగరంలో, ఒంటిమిట్ట రహదారి, రేణిగుంట రహదారిపై ట్రాఫిక్ మళ్లింపు అమలులో ఉంటుందని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మళ్లింపు ఈ నెల 11 వ తేదీ ఉదయం నుంచి 12 వ తేది ఉదయం వరకు అమలులో ఉంటుందని తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు..

- కడప నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం అలంఖాన్ పల్లి ఇర్కాన్ జంక్షన్ నుంచి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలి.
- తిరుపతి నుండి కడప వైపు వచ్చే భారీ వాహనాలు, రవాణా వాహనాలు రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి.
- రాజంపేట వైపు నుండి కడప వెళ్లే భారీ వాహనాలను రాయచోటి మీదుగా దారి మళ్లింపు. రాజంపేట వైపు నుండి వచ్చే ద్విచక్ర వాహనాలను సాలాబాద్ నుండి ఇబ్రహీం పేట, మాధవరం మీదుగా పంపిస్తారు.

18 చోట్ల పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు..

శ్రీ సీతారామ కల్యాణానికి రాజంపేట వైపు నుండి వచ్చే భక్తులు టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను సాలాబాద్ సమీపంలో 5 చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో క్రమపద్ధతిలో నిలపాలి. కల్యాణ వేదిక నుండి కడప మార్గంలో 13 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు.

కడప రహదారి వైపు పార్కింగ్ ప్రదేశాల వివరాలు..

కడప వైపు నుండి ఒంటిమిట్ట వచ్చే భక్తుల కోసం 13 ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాటు చేశారు.

- ఫోర్ వీలర్స్‌కు జనరల్ పార్కింగ్ – చలమయ్య యాదవ్ సైట్..మాధవరం 1 (హెచ్ పి పెట్రోల్ బంక్ తూర్పు వైపున)
- త్రీ వీలర్స్‌కు పార్కింగ్ –కనకదుర్గ కళ్యాణ మండపానికి పడమటి వైపున మాధవరం1
- కార్ పార్కింగ్ – కనకదుర్గ కల్యాణ మండపం తూర్పు వైపున ...మాధవరం 1
- కార్ పార్కింగ్ – సన్నీ ఫుడ్ కోర్ట్ ఫ్యామిలి దాబా తూర్పు వైపు
- కార్ పార్కింగ్ – సన్నీ ఫుడ్ కోర్ట్ ఫ్యామిలి దాబా పడమటి వైపు
- ట్రాక్టర్‌లు, లారీల పార్కింగ్ – సన్నీ ఫుడ్ కోర్ట్ నుండి పడమటి వైపు సాయిబాబా గుడి, ఉప్పరపల్లి గ్రామం(ట్రాఫిక్ మళ్లింపు ప్రదేశం)
- కార్ పార్కింగ్– ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , కొత్త మాధవరం(ఫారెస్ట్ చెక్ పోస్ట్ ఎదురుగా)
- ఆర్.టి.సి బస్సుల పార్కింగ్ – శ్రీ షిర్డీ సాయి డిగ్రీ కాలేజి, ఓబుల్ రెడ్డి వాటర్ ప్లాంట్/ స్పైసెస్ బోర్డు మధ్యలో
- ఫ్రీ బస్సులు, వి.ఐ.పి కార్ పార్కింగ్ – శ్రీ షిర్డీ సాయి డిగ్రీ కాలేజి, రాయలసీమ హోటల్ (వి.వి.ఐ.పి – వి.ఐ.పి ఎంట్రెన్సు ఆర్చి ఎదురుగా)
- పోలీసు వాహనాల పార్కింగ్ –ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ – మయూర హోటల్ వెనుక వైపు
- ఇతర శాఖల వాహనాల పార్కింగ్ – ఈద్గా పక్కన, ఒంటిమిట్ట (కార్ పార్కింగ్)
- టి.టి.డి వాహనాల పార్కింగ్ –కల్యాణ వేదిక ప్రధాన ప్రవేశం ఆర్చ్ వద్ద ఉన్న సత్రం వద్ద
- టూ వీలర్, కార్ పార్కింగ్ – కల్యాణ రామ టౌన్ షిప్, బ్రిడ్జి పక్కన, దర్జిపల్లి రోడ్, కొత్త పల్లి గ్రామ సమీపంలో

రాజంపేట రహదారి వైపు పార్కింగ్ ప్రదేశాల వివరాలు

- ఆర్.టి.సి బస్సు పార్కింగ్ –సాలాబాద్ క్రాస్ వద్ద
- ఫోర్ వీలర్ , టూ వీలర్ పార్కింగ్–మదరసా, మలకాటి పల్లి గ్రామం.
- ఫోర్ వీలర్, టూ వీలర్ పార్కింగ్–మలకాటి పల్లి గ్రామం వద్ద.
- వి.ఐ.పి కార్ పార్కింగ్ –బి.సి బాయ్స్ హాస్టల్, ఒంటిమిట్ట టౌన్
- వి.ఐ.పి కార్ పార్కింగ్ – దుర్గమ్మ గుడి ముందు వైపు, ఒంటిమిట్ట టౌన్

అత్తమామలు, మరిది వేధింపులపై ఫిర్యాదు

ఎర్రగుంట్ల : తనను అత్త మామలు, మరిది వేధిస్తున్నారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కలమల్ల పోలీసు స్టేషన్ ఏఎస్ఐ రమణ కథనం మేరకు.. కలమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని క్రిష్టానగర్ కాలనీలో ఈశ్వరమ్మ అనే మహిళ నివాసముంటున్నారు. ఈమె భర్త నాగేశయ్య మృతి చెందాడు. ఈశ్వరమ్మకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అయితే ఈశ్వరమ్మ మరిది గోపి ఆయన భార్య ఎలిషమ్మ, అత్తమామలు కలసి నిత్యం వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు మనస్తాపానికి గురై భయపడి ఇంటిలో మాత్రలు వేసుకుని పడిపోయింది. ఆమె కుమారుడు గమనించి వెంటనే ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించాడు. అక్కడ కోలుకున్న తర్వాత ఈశ్వరమ్మ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గేటు డబ్బులు అడిగినందుకు ఘర్షణ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డులో లారీలు పార్కింగ్‌కు సంబంధించి గేటు నిర్వాహకులు గేటు డబ్బులు అడిగినందుకు లారీ డ్రైవర్లు శ్రీహరి, శ్రీనివాసులు గేటు నిర్వాహకులతో గొడవకు దిగారు. గేటు నిర్వాహకులు, లారీ డ్రైవర్ల మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేబ్రోలు కిరణ్‌కుమార్‌పై ఫిర్యాదు


చెన్నూరు: ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


జమ్మలమడుగు: ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వల్లూరు (చెన్నూరు)/జమ్మలమడుగు రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ ప్రతినిధి చేబ్రోలు కిరణ్ కుమార్‌పై చెన్నూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, పార్టీ అనుబంధ విభాగ సభ్యులైన నిరంజన్‌రెడ్డి, దేవగుడి భాస్కర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేష్ యాదవ్, అల్లి శ్రీరాములు, పార్టీ కార్యకర్తలు చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అలాగే జమ్మలమడుగుకు చెందిన వైఎస్సార్‌సీపీ కడప జిల్లా మునిసిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంభాయి హృషికేశవరెడ్డి గురువారం జమ్మలమడుగు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామక్రిష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి మోహన్‌రెడ్డి, మునిసిపల్ కో ఆప్షన్ మెంబర్ ఫయాజ్ బాషా, రాష్ట్ర మేధావుల వర్గం నాయకుడు వేణుగోపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి యోబు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు శ్రీనివాసులు, మైలవరం మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, తాజుద్దీన్, గాజ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, ఇతర మహిళా నేతలు కలిసి చేబ్రోలు కిరణ్ పై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏ పార్టీలో అయినా మహిళలపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు పత్తి రాజేశ్వరి, వైఎస్ఆర్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కృష్ణవేణి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు యానాదయ్య, సీహెచ్ వినోద్‌కుమార్, మల్లికార్జున, ఇతర మహిళా నేతలు పాల్గొన్నారు.


చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కమలాపురం ఉరుసు మహోత్సవాలను
జయప్రదం చేయండి


ఉరుసు మహోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఇస్మాయిల్ తదితరులు

కమలాపురం : ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కమలాపురం దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా ఉరుసు మహోత్సవాలను జయప్రదం చేయాలని దర్గా కన్వీనర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆ దర్గా ఆవరణంలో పాస్టర్ ప్రభుదాస్, వేద పండితులు జితేంద్ర శర్మతో కలసి ఆయన ఉరుసు ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జరిగే కమలాపురం గఫార్ షా ఖాద్రి ఉరుసు మహోత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే ఖ్యాతి గడించిన ఈ ఉరుసు మహోత్సవాలకు రాష్ట్రం నలు మూలల నుంచే కాక దక్షిణ భారత దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి స్వామి వారి భక్తులు తరలివస్తారని ఆయన వివరించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉరుసుకు ఏర్పాట్లు సిద్ధం

రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన కమలాపురం హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ దస్తగిరి షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఉరుసు మహోత్సవాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఇప్పటికే రంగు రంగుల విద్యుద్దీపాలతో దర్గాను సుందరంగా అలంకరించారు. మిరుమిట్లు గొలిపే కాంతులతో దర్గా కనుల విందుగా మారింది. దర్గా ఆవరణంలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. అన్నదాన శిబిరాలు, చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు షెల్టర్లు సిద్ధం చేశారు. చిన్నారుల కోసం జాయింట్ వీల్స్, బ్రేక్ డ్యాన్స్, రంగుల రాట్నాలు, ప్రత్యేక స్వీటు దుకాణాలు ఏర్పాటు చేశారు.

ఇతర రాష్ట్రాల భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్రం నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి నివాసం ఎదుట ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు. వారికి భోజనంతో పాటు అన్ని వసతులు సిద్ధం చేసినట్లు దర్గా కన్వీనర్ ఇస్మాయిల్ తెలిపారు.

గంధం, ఉరుసుకు ప్రత్యేక బస్సులు

కమలాపురం ఉరుసు మహోత్సవాల్లో భాగంగా గంధం, ఉరుసు జరిగే రెండు రోజుల పాటు కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని డీఎంలకు విన్నవించామని, వారు స్పందించి ఆ రోజులలో ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

చక్రాయపేట మండలంలో టీడీపీ నాయకుల వీరంగం

- వైఎస్ఆర్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రాంబాబుపై దాడి
- వైఎస్సార్‌సీపీ నేతల ఫ్లెక్సీల చించివేత


టీడీపీ నాయకుల దాడికి గురైన వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు దాసరి రాంబాబు


వైఎస్సార్‌సీపీ నేతల ఫ్లెక్సీలను చించి వేస్తున్న తెలుగుదేశం కార్యకర్త

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లెలో గురువారం టీడీపీ నాయకులు బీభత్సం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమితుడైన నాగలగుట్టపల్లెకు చెందిన రాంబాబు ఫ్లెక్సీలు కట్టి కేక్ కత్తిరించడం జీర్ణించుకోలేక తెలుగుదేశం పార్టీ నేతలు ఈ దారుణానికి తెగబడ్డారు. వివరాలిలా ఉన్నాయి. రాంబాబును వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమించడంతో ఫ్లెక్సీలు కట్టి కేక్ కత్తిరించి బుధవారం సాయంత్రం సంబరాలు జరుపుకున్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కొందరు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నేతల ఫ్లెక్సీలు తొలగించాలని పోలీసులపై వత్తిడి తెచ్చారు. దీంతో పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతలను పిలిచి ఫ్లెక్సీలు తీయాలని ఆదేశించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నేతలు కూడా టీడీపీ నేతల ఫ్లెక్సీలు తీస్తే తాము తీసేస్తామని చెప్పారు. దీంతో టీడీపీ శ్రేణులు బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులను రప్పించుకొని నాగలగుట్టపల్లెలో ఈలలు కేకలు వేస్తూ మారణాయుధాలు చేతబట్టి భయోత్పాతం సృష్టిస్తూ వైఎస్సార్‌సీపీ నేతల ఫ్లెక్సీలను చించివేశారు.అక్కడే ఉన్న మండల ఉపాధ్యక్షుడు రాంబాబుపై దాడి చేశారు.

పోలీసులకు ఫిర్యాదు

నాగలగుట్టపల్లెలో గురువారం జరిగిన సంఘటనకు సంబంధించి బాధితుడు దాసరి రాంబాబు చక్రాయపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన దాసరి ఆంజనేయులు, మురికినాటి సాయిప్రసాద్, పగడాల పరమేశ్వర, తుపాకుల సుదర్శన్, బోర్‌వెల్ రామాంజులరెడ్డి, ఎద్దుల చంద్ర, తాళ్లపల్లె ప్రవీణ్‌తో పాటు మరికొందరు మారణాయుధాలతో వచ్చి తనపై దాడి చేసి ఫ్లెక్సీలు చించేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన తమ్ముడు వచ్చి కాపాడకపోతే తనను చంపేసేవారని తెలిపారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్


మాజీ సీఎం వైఎస్ జగన్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లెలోని ఆయన నివాసంలో ఇటీవల జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన ముత్యాల రామగోవిందురెడ్డి కలిశారు. జిల్లా మాజీ ఎమ్మెల్యేలు ఎస్ రఘురామిరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అవకాశం కల్పించిన పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపి సన్మానం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో జెడ్పీ చైర్మన్ తనయుడు ముత్యాల శ్రీనివాసులరెడ్డి, కల్లూరు నాగేంద్రారెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, దువ్వూరు మాజీ జెడ్పీటీసీ గుడిపాడు బాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన వీరబ్రహ్మయ్య

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డి పల్లె సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లాకు చెందిన తెన్నేటి వీరబ్రహ్మయ్య (65) అనే వ్యక్తి మృతి చెందాడు. మైదుకూరు – బద్వేలు రహదారిలోని గోపిరెడ్డిపల్లె వద్ద సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బద్వేలు వైపు వెళుతున్న కారును ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుని బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా పెసరవాయి గ్రామానికి చెందిన వీరబ్రహ్మయ్య గ్రామంలోనే పురోహితుడుగా పనిచేస్తున్నాడు. ప్రొద్దుటూరులో ఓ కార్యక్రమానికి వచ్చిన ఆయన అక్కడ నుంచి స్వయంగా కారు నడుపుకొంటూ బద్వేలుకు వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సంఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది కారులో ఇరుక్కుపోయిన వీరబ్రహ్మయ్య మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య మల్లేశ్వరమ్మ, వివాహితులైన ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సును ఢీకొని యువకుడి మృతి


మృతి చెందిన గురుదత్

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణం ముద్దనూరు రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిరివెళ్ల గురుదత్ (20) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన సిరివెళ్ల గురుదత్ సొంత పనుల నిమిత్తం పట్టణానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌లో వెళుతుండగా మార్గమధ్యంలోని పతంగే రామన్నరావు ప్రభుత్వ హైస్కూల్ సమీపంలో జమ్మలమడుగు నుంచి ముద్దనూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ సంఘటనలో గాయపడిన యువకుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. గురుదత్ తండ్రి సిరివెళ్ల రాఘవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కత్తితో భయపెట్టి బంగారు గొలుసు లాక్కెళ్లాడు

సింహాద్రిపురం : ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తి కత్తితో భయపెట్టి ఆమె వద్ద ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన సింహాద్రిపురం మండలంలో జరిగింది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. సింహాద్రిపురం మండలం బలపనూరులో ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న వంగల సుధేష్ణ నక్కలపల్లె గ్రామంలో నివాసముంటోంది. మధ్యాహ్నం విధులు ముగించుకుని తన స్కూటీపై బలపనూరు నుంచి నక్కలపల్లెకు వెళుతుండగా.. నక్కలపల్లె గ్రామం నుంచి ఎదురుగా బైకుపై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అటకాయించాడు. కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న మూడు తులాలపైబడిన బంగారు గొలుసును లాక్కుని బైకుపై పులివెందుల వైపు పారిపోయాడు. అనంతరం ఆమె నక్కలపల్లె గ్రామానికి వెళ్లి భర్త జనార్దన్‌రెడ్డికి విషయం తెలపడంతో ఇరువురు సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.